# కమల

దిగులుగా కూర్చుంది కమల.

ఎన్నడూ ఎవరిచేతా మాటపడి ఎరుగని కమలకు కళ్ళు చెమర్చినంత బాధకల్గింది. మారుమాటాడకుండా నెమ్మదిగా తన గదిలోకివచ్చి కూర్చుంది. అత్తగారి గొంతు తగ్గు స్థాయిలో విన్పిస్తోనేవుంది. అర్థంగాకపోయినా – తన గురించే తనకు సిగ్గు తప్పితే అత్తగారిమీద కోపమేమీ రాలేదు. అవును–ఆవిడ ఏమైనా అనుకోవచ్చు. పొరపాటు తనదే! "వదినా! అన్నం పెడుదువుగానిరావూ? అంటూ ఆడబిడ్డ స్కూలునుంచి వచ్చి అడిగితే తను చటుక్కున ఎందుకు లేచి వెళ్ళకూడదు?

"కాస్సేపు ఆగు రాధా! ఈ కాస్త చదివివస్తాను." పుస్తకంలోంచి తలైనా ఎత్తకుండా జవాబుచెప్పింది తను. పాపం–మిట్టమధ్యాహ్నం బడినుంచి వచ్చిన రాధకి ఎంతఆకలి వేసిందో! ఆగమంటే మాత్రం ఎలాఆగుతుంది?

తర్వాత చదువుకొందువుగాని, రా వదినా! ఆకలేస్తోంది! అంది జాలిగానే.

అయినా తనేంపట్టించుకునేస్థితిలో లేదప్పుడు. "వెళ్ళి మీ అమ్మగారితో పెట్టించుకుందూ! చదువుకుంటూంటే, నేనే లేచి రావాలా ఏమిటి?" అంది విసుగ్గా.

రాధ భయపడుతూన్న దానిలా–"అమ్మ నిద్రపోతోంది వదినా !" అంది మెల్లిగా. ఛ! ఏమిటి పెంకిపిల్ల? అనిపించింది తనకు. ఏమయినా సరే ప్రేమికులు మొట్టమొదటి సారిగా కలుసుకుంటున్న ఆ ఘట్టంలో పుస్తకం ఆపుచెయ్యటం ఇష్టంలేదు తనకి. జిడ్డులా పట్టుకున్న ఆడబిడ్డమీద కొంచెం కోపంకూడా రాకపోలేదు.

"నువ్వెళ్ళి పెట్టుకు తిందూ! అన్నంకూడా పెట్టుకోలేవేమిటి?" అనేసరికి రాధ మారు మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

తను హాయిగా ప్రేయసీప్రియులతో కలవబోతోంటే అత్తగారి కంఠం గంటలా విన్పించింది– "అబ్బ! ఏమిటే నీ గొడవ? వదిన పెడుతుంది వెళ్ళు! ఇప్పుడే నడుం వాల్చాను. నే లేవలేను. కళ్ళు మూసుకుపోతున్నాయి..."

"వదిన ఏదో చదువుకుంటూందమ్మా! రాదట. నీతో పెట్టించుకోమంది. లేకపోతే నన్నే పెట్టుకోమంది."

అత్తగారికిచాలా కోపంవచ్చిందికాబోలు–"నిన్ను పెట్టుకోమందా? గొప్ప సలహాయిచ్చింది. పద, వస్తున్నాను. రానంటే ఆవిడికి సాగుతుందిగానీ నా కెలా సాగుతుంది?...పొద్దు నడినెత్తికొచ్చేవరకూ ఒక్క రెక్కమీద చాకిరీ అంతా చేసుకోలేంది పసిముండవి నీవొచ్చి అడిగేసరికే బద్ధకించాలా నేను? పెద్దదాన్ని కాస్త నడుంవాలిస్తే...కోడలుండికూడా... సరేలే! నడు..."

అత్తగారి గొంతు వింటుంటే తనకు కాస్తభయం వేసింది. పుస్తకం పరుపుమీదపెట్టి గబగబా వంటింట్లోకి

వెళ్ళింది. కొంచెం ధైర్యం తెచ్చుకొని— "నేను వడ్డిస్తా నత్తయ్యా! మీరు వెళ్ళి పడుకోండి." అంటూ చొరవగా గరిటె తీసుకోపోయింది.

"ఒద్దుతల్లీ! వెళ్ళి చదువుకో, వేళాపాళాలేకుండా ఈ చాకిరీ నువ్వేంచేస్తావు? నీతో నాకు వంతాఏమిటి? నా పిల్లకి నేను తిండి పెట్టుకోగలను. వెళ్ళి చదువుకో." అత్తగారు గరిటె అందనివ్వకపోయేసరికి తనకి సిగ్గుతో ప్రాణం చచ్చిపోయింది. మరేమీ మాట్లాడలేకపోయింది.

నెమ్మదిగావచ్చి గదిలో కూర్చుంది. మరి పుస్తకం చదవబుద్ధికాలేదు. కొత్తగా అత్తారింటికి వచ్చిన ఈ వారం రోజులలోనూ అత్తగారితో తనకు మాట పట్టింపురాలేదు, అనుకోకుండా ఈ పూట, "ఛ! నేనే తప్పుచేశాను," అనుకుంది కమల. నిన్న మొన్నటివరకూ వదినచేతా అమ్మచేతా అన్నం పెట్టించుకు తినే తనకి రాధలాంటి చిన్నపిల్లకి అన్నం వడ్డించాలన్న సంగతెందుకు తెలీలేదు.

నిజంగా కమల సిగ్గుపడిపోయింది. పాడుబద్ధకాన్ని తిట్టుకుంది. ఏ పనీ చటుక్కునలేచి చేసే అలవాటులేదయ్యె; పుట్టింట జరిగినట్టు అత్తింట సాగదంటూను ఇదేకాబోలు.

కళ్ళు చెమర్చినంత బాధకల్గింది కమలకు. ఆ సాయంత్రం...

సావిత్రమ్మ ఏమీ జరగనట్టు కలివిడిగానే పల్కరిస్తోన్నా కమలే అత్తగారి మొహంలోకి సూటిగా చూడలేకపోయింది కుంపటి అంటించి కాఫీ నీళ్ళు పెట్టింది. అంతవరకూ బాగానే చేతనైంది. "ఓ తవ్వెడు బియ్యం కొల్చి

తీసుకురా అమ్మాయ్! ఏరుతాను" అంటూ కాఫీ గ్లాసుతో దొడ్డి గడపలో చతికిలబడింది సావిత్రమ్మ. "అమ్మా!అమ్మా!" వీధి చీడీలమీద నిలబడి అరిచింది రాధ !

"ఏవిటే? రా లోపలికి."

"సావిత్రి పిన్నికి ఒంట్లో బాగాలేదట. నిన్నోసారి గమ్మున పిల్చుకు రమ్మంది. నే పోతున్నానోయ్!" అంటూ తూనీగలా ఎగిరిపోయింది రాధ.

"అయ్యో! సావిత్రి బాగాలేకపోవటం ఏమిటి?ఎనిమిదో నెలే అందిగా మొన్న. నెప్పులొస్తున్నాయా ఏమిటి ఖర్మ! ఏ కబురూ సరిగ్గా చెప్పకుండానే పరిగెత్తిందే ఈ అల్లరిముండ."

అత్తగారి స్వగతం వింటూనే వుంది కమల.

"అమ్మాయ్ కమలా! నే నొక్కసారి సావిత్రిని చూసి వస్తానే! పాపం ఒక్కతీ ఏం కంగారుపడుతోందో! వుత్తమనిషి కాదమ్మే !"

అత్తగారు చెప్పబోయే దేమిటో కమలకేమీ అర్థం కాలేదు. అలాగే చూస్తూ నిలబడింది.

సావిత్రమ్మ పైట దులిపి నిండుగా బుజంచుట్టూ తిప్పు కుంటూ" ఓ తవ్వెడు బియ్యంవార్చి రెండు దోసకాయలు పచ్చడిచెయ్యి. పొద్దుటి పప్పుచారుందిలే, సరిపోతుందిలే, సరిపోతుంది. మరి వెళ్ళిరానా? చీకటి పడకుండ వచ్చేస్తాలే... రాధ కనిపిస్తే పంపిస్తాను సాయంగా వుంటుంది. తలుపేసుకో," వీధిరోడ్డు ఎక్కేంతవరకూ మాట్లాడుతూనే వెళ్ళిందావిడ.

కమల దాదాపు కర్రబొమ్మలా నిలబడిపోయింది చాలాసేపు...ఏం చెయ్యాలిప్పుడు? తనకు బొత్తిగా వంట చేతరాదని అత్తగారికి తెలీదూ? తవ్వెడు బియ్యం అన్నంవార్చి రెండు దోసకాయలు పచ్చడి చెయ్యాలా? ఎలా? అసలా పచ్చడెలా చెయ్యటం?

ఏమీ పాలుపోలేదు కమలకి...నీరసంగా నడిచివెళ్ళి వీధి తలపులు వేసి వచ్చింది. కుంపటిలో బొగ్గులు నీళ్ళు గారు తోంటే విసనకర్ర అందుకుని విసురుతూ కూర్చుంది. బొగ్గులు కాస్త కలకలలాడుతోంటే ఎసరు ఎక్కించి దోసకాయలూ కత్తిపీటా దగ్గరపెట్టుకుంది. కొత్త కోడలిగా వంటగదిలో అత్త గారిముందు దిష్టిబొమ్మలా కూర్చోవడమేగానీ వచ్చిన వారం రోజులనుంచీ వంటా వార్పూ సంగతి ఎలా అవుతున్నాయో తెలియనైనా తెలియదు. ఇక పుట్టింటిసంగతి సరేసరి! "ఆయ నేవుంటే విస్తరెందుకూ?" అన్నట్టే – దోసకాయ చెక్కడం బొత్తిగా చేతకావడం లేదు. ఎలా యిప్పుడు? పోనీ ఏదీ చెయ్యకుండా వూరుకుంటే ... అమ్మో! రాత్రి భోజనాల మాట...? పోనీ ఎలాగో చెక్కులు తీసిపోస్తేసరి – మరేం చెయ్యాలి చేతకానప్పుడు?

ఎసరు మరిగిమరిగి మూత ఎగిరెగిరి పడుతోంటే కుం పటికేసి చూసింది కమల – "బియ్యం కడిగి వెయ్యాలి కాబోలు" చెరగడం రాదే! ఆదరాబాదరా కడిగి_కడుగుతూ ఓ గుప్పెడు బియ్యం క్రిందపోసి ఎసరుగిన్నెమీద మూత తీసింది. గుప్పుమని మొహంమీదకి లేచిన ఆవిరికి భయపడి మరో గుప్పెడు బియ్యం కుంపట్లో పోసింది. బొగ్గులు

"ఛుఁయ్ ఛుఁయ్" మని ఆరిపోతోంటే బలంకొద్దీ విసురుతూ కూర్చుంది - అన్నం కుతకుత లాడుతోంటే వార్చబోయింది. ఆవిరి వేడికి వేళ్ళు భగ్గుమనగానే "అమ్మో" అంటూ అన్నం గిన్నె కింద కుదేసింది. గంజి చింది కుడికాలిమీదపడి బుడగలా బొబ్బలేచింది. కళ్ళనీళ్ళ పర్యంతమైంది కమలకు-అన్నం వార్చలేదు, దోసకాయలు చెక్కనైనా లేదు. కుంపటి చప్పగా చల్లారిపోయింది. పైగా తన కాలొకటి భగభగా మండిపోతూంది - ఛ! వంటరాదని చెప్పనైనా చెప్పానుగాను. పాడు అభిమానం! మాట పెగలకుండా చేసింది. చెప్పినా బావుండిపోయేది." అంటూ తనని తను తిట్టుకొంటూ బిక్కమొహం వేసుకూర్చుంది. అత్తగారేక్షణంలో వస్తుందో పర్యవసానం ఎలా వుంటుందోనని గుండెలు గుబగుబలాడుతోంటే ఏమీ తోచక అయోమయంగా చూస్తూ కూర్చుంది. కమల ఆలోచనలు పరిపరివిధాల పరుగెత్తాయి-ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు తను. ఎదుర్కోవలసి వస్తే ఇంత దారుణంగా వుంటుందని మాత్రం వూహించలేదు.

వదిన! ఎన్నో విధాల చెప్పేది - అనునయంగా బోధపర్చబోయేది. వూహూ! తను వింటేగా? అమ్మ విననిస్తేగా? తన గురించి అమ్మా, వదినా మాటలు పెంచుకునేవాళ్ళు కూడా...

ఆ రోజు ... వదిన ఎంత అభిమానంతో చెప్పిందో! ఆరోజే ఏమిటి? అలాంటిరోజులు ఎన్ని లేవు?-ఆరోజు ఆ ఒకానొకరోజు...మరీ కొట్టవచ్చినట్టు గుర్తు వచ్చింది కమలకు.

* * *

హాల్లో కూర్చుని పత్రిక చదువుకుంటున్న కమల ఏదో గుర్తువచ్చినట్టు లేచి వంటింట్లోకి తొంగిచూసింది.

వదిన_రాజేశ్వరి బియ్యం ఏరుకుంటోంది. "వదినా! నేని వ్వాళ కాలేజీకి ఓ అరగంటముందు వెళ్ళాలి." అంది కమల హుందాగా.

"వెళ్ళవమ్మా! వెళ్ళు, నిన్నిప్పుడు ఒద్దన్న దెవరు? అర గంట కాకపోతే గంటముందు వెళ్ళు" అంది రాజేశ్వరి తలైనా ఎత్తకుండా. కమల నవ్వి గడపమీద కూర్చుంటూ_ "ఒద్దులే వదినా! గంటముందుగా వంట చెయ్యలేవు. చెయ్యగలనంటే నా అభ్యంతరమేమీ లేదుమరి." అంది హాస్యంగా.

"అదా సంగతి?" అంటూ తలెత్తిచూసింది రాజేశ్వరి_ "అయితే ఇలా వచ్చి బీరకాయలు తరిగిపెట్టు. వంట తొం దరగానూ అవుతుంది, నువ్వు వెళ్ళనూవచ్చు."

కమల చటుక్కున లేచి నించుంటూ_ "బలేదానివే! నేనిప్పుడు బోలెడు రాసుకోవాలి, వంటమాట చెప్పిపోదామని వస్తే...పని పెడుతున్నావా?" అంటూ చేతిలో పుస్తకానికి పైట చెంగు చాటుచేసుకొంది.

రాజేశ్వరి నవ్వి_ "నాకు తెలుసు నమ్మోయ్ నీ వం కలు. నువ్వు చదవాల్సింది వార పత్రికలేగా? ఆ పుస్తకం అక్కడ పడేసివచ్చి కూరలు తరిగిపెట్టు, నేను మరో పని చూసుకుంటాను." అంటూ బియ్యంలో నీళ్ళు పోసింది కడగ టానికి.

వదినకు పట్టుబడి పోయానని గ్రహించిన కమల నవ్వే సింది. ఐనా నాకు బీరకాయలు చెక్కటంరాదే!" అంది కళ్ళు పెద్దవిచేస్తూ,

"పోనీ కాసిన్ని వుల్లిపాయలు ఒలిచి..."

"అమ్మో!" కెవ్వుమంది కమల– "ఉల్లిపాయలే! ఒద్దు తల్లీ! నీకోనమస్కారం! నీ వంటకో నమస్కారం! వాటి గురించి మాత్రం నాకు చెప్పకు పాడువుల్లిపాయలు! ముట్టుకు న్నానంటే గోళ్ళు నల్లబడి పోతాయి, కళ్ళు వుబ్బిపోతాయి. ముక్కులు వాచిపోతాయి. మొహం అంతా కందిపో తుంది...

"అలాగా? పప్పుచారులో వుల్లిగడ్డలు గరిటెలతోతీసి ఏరుకు మరీ తింటావు, వెళ్ళినచోట వెళ్ళబోయాలి ఈ దర్జా అంతా" అంటూ వెటకారం చేసింది రాజేశ్వరి.

"దర్జాకేం లోటువదినా! వుండేవాళ్ళకెప్పుడూ వుం టుంది" అంది కమల నిర్లక్ష్యంగా.

"అయితే నువ్వసలు వంట నేర్చుకోనంటావు. అం తేనా?" కత్తిపీటా బీరకాయలూ ముందు వేసుకు కూర్చుంటూ రెట్టించింది రాజేశ్వరి.

"ఓస్! వంటేం భాగ్యం వదినా? ఇప్పటినుంచీ నేర్చు కోవా లేమిటి? ఎప్పుడు కావాలంటే అప్పుడే చేసేస్తాను."

"ఓ నాలుగు రకాల వంటింటి సౌభాగ్యాలు" కొను క్కుంటావు కాబోలు, అవునమ్మా! చదువుకున్నదానివి ఏవిద్య

నయినా నిముషాలలో నేర్చుకోగలవు. పోనీగానీ ఎసరు మరుగుతోంది,, కాస్త బియ్యం వేసి పెట్టూ!" బీరకాయలు తరుగుతూ కూర్చుండి పోయింది రాజేశ్వరి.

వదినగారి పురమాయింపులకు కమల చిరాకుపడింది. "అబ్బ! ఏమిటొదినా! నేను పోయి చదువుకోవాలంటే ఏదో పని పెడతావు," రాజేశ్వరి ఆడబిడ్డకేసి ఆశ్చర్యంగా చూసింది-"ఎంత బద్ధకం కమలా నీకు? మరిపెళ్ళయితే ఒక్కసారిగా ఎలా చేస్తావీ పనులన్నీ?" అంది ఆశ్చర్యంగా - "పని పాటలు తెలిసివుండటంమంచిదే కమలా! లేకపోతే...ఒక్కసారిగా..." అంటూ నీతులు చెప్పబోతున్న వదినగారిమీద కోపం ముంచుకు వచ్చింది కమలకు.

"నీ లెక్చర్ వినటానికేం రాలేదు వదినా! నేను తొందరగా పోవాలి. కాస్త వంట తొందరగా కానీ!"

రాజేశ్వరి లేచి ఎసట్లో బియ్యం వేస్తూ నిర్లక్ష్యంగా అంది—"ఎప్పటికవ్వాలో అప్పుడే అవుతుంది. తొందర తొందరఅంటూ నన్ను తరుముతోంటే నాకేం పది చేతు లున్నాయా చెయ్యటానికి? వెళ్ళి చదువుకో. నన్నేం కంగారు పెట్టకు."

కమల కోపం ఎక్కువైంది—రోషంగా అంది-"నేను ఆలస్యంగా వెళ్ళినా నీకేం అవసరం లేదంటావ్. అంతేనా? పోనీ నన్ను కాలేజీ మానుకోమంటావా?"

రాజేశ్వరి శాంతంగా కంఠం మార్చుకుని—"నేనేం అనను. రెండు చేతులా చేస్తాను. అయినప్పటికే అవుతుంది

ఇంత మాత్రానికే ఎందుకలా కోపం తెచ్చుకుంటావు?" అంది పొయ్యిలో కర్రలు సర్దుతూ.

పూజ ముగించుకుని ఫలహారం పళ్ళెంతో వస్తూ కమల తల్లి పార్వతమ్మ—"ఏమిట్రా గొడవ? ఏమైందీ? ముందు హారతి కళ్ళకద్దుకోండి." అంది.

రాజేశ్వరి హారతి కళ్ళద్దుకుని పూజాపుష్పం ముడి మీద గుచ్చుకుని, కొబ్బరి ముక్కలు నోట్లో పడేసుకుని కూర్చుంది మౌనంగా. కమల కొబ్బరి ముక్కలు గుప్పెట్లో పట్టుకుని అలాగే నిలబడింది గుమ్మంలో.

"ఏమైందర్రా? ఎవరూ మాట్లాడరేం? ఎందుకలా మూతులు ముడుచుకున్నారు? ఏమే కమలా! ఏమిటే గొడవ?" అంటూ రొక్షించి అడిగింది పార్వతమ్మ-కమల మాట్లాడేంతలో రాజేశ్వరే అంది-"తను తొందరగా వెళ్ళాలట ఈ పూట, వంట తొందరగా చెయ్యమంటే రెండు చేతులా చేస్తాను అయి నప్పటికే అవుతుందీ అన్నాను. అదీ నా తప్పు."

కమల అందుకుంది-"నన్ను సాయంచేయమంటోంది. నాకేమో బోలెడుహోంవర్కుంది. ఇక్కడ కూర్చుంటే ఎలా."

పార్వతమ్మకి కోడలిమీదే కోపం వచ్చింది. "అవునే రాజేశ్వరీ! చదువుకీ యింటిపనికీ లంగరెలా కుదురుతుందీ? దాన్ని సాయం చెయ్యమనక పోతేనేం? పూజకాగానే నేను రానూ?"

"చదువుకునే వాళ్ళుకూడా యింటి పనులు చేసుకుంటా రత్తయ్యా" అనేసింది రాజేశ్వరి వుండబట్టలేక.

"ఆఁ చేసుకుంటారు గతిలేనివాళ్ళు. ఇప్పుడు కమలకి ఇంటి చాకిరీ చెయ్యాలనే ఖర్మేమిటే?"

"ఇంటిపనులు చేసుకోవటం ఖర్మేనంటారా అత్తయ్యా"

"ఇప్పటినుంచీ ఎందుకే వెధవ బాదరబందీ! వెళ్ళవే కమలా! వెళ్ళి చదువుకో—ఆ పనేదో నేను చూస్తాను." కోడలి నుద్దేశించి ఖచ్చితంగా చెప్పింది పార్వతమ్మ— "ఇదిగో అమ్మాయ్! నువ్వుమాత్రం దానికి పనిలో వంతు లెయ్యకు తెలిసిందా?"

రాజేశ్వరి తెల్లబోయింది—

"నీ ధోరణి నేను ఎప్పటికప్పుడు చూస్తూనే వున్నాను, అది పనిలో చెయ్యిపెట్టటం లేదని నీకు కష్టంగా వున్నట్టుంది. వుంటేవుండనీ! అదిమాత్రం హాయిగా చదువుకోవాల్సిందే."

రాజేశ్వరి ఖిన్నురాలైంది. జవాబివ్వకుండా వుండలేక పోయింది— "కమల పని నేర్చుకుంటుందనిగాని..."

"ఆఁ ఇంతోటి అందాల పనీ నీ దగ్గరే నేర్చుకోవాలి, సమయం వస్తేసరి. అదే తెలుసుకుంటుంది. అదేం పిచ్చిదా? వెర్రిదా?" అంటూ చేతులు తిప్పింది పార్వతమ్మ.

అత్తగారి ఈసడింపులూ వెటకారాలూ అలవాటైన రాజేశ్వరి— "మాటకు మాట తెగులు నీటికి నాచు తెగులు," అనుకుని వూరుకుంది.

కమల హాల్లో కూర్చుని పుస్తకం తెరిచిందేగానీ కళ్ళు అక్షరాలమీద నిలవలేదు. మనస్సు భవిష్యత్తులోకి పోయి

ఆశాసౌధాలు నిర్మించ సాగింది_వదినకు బొత్తిగా చాదస్తం! అస్తమానం వంటింటి కుందేలులా తను కూర్చునేది చాలక అందర్నీ ఆ ధ్రూబిలోకే దిగమంటుంది__తనూ వదినలా వంటా వార్పూ చూసుకోవలసిందేనా? మరి ఇంత కష్టపడి చదువుకోటం దేనికి? గ్రాడ్యుయేట్ ఐతేగాని తను చదువే విరమించదు. ఇక ఆ పైన చెప్పేదేముంది? ఉద్యోగం ఎలాగూ ఖాయం. ఇక పెళ్ళిమాటా? ఐతే అవుతుంది-ఏపోస్ట్ గ్రాడ్యు యేట్‌తోనో, ఇద్దరూ పెద్దపెద్ద ఉద్యోగాలు చేసుకొంటూంటే ఇక వంట మాటెక్కడ? ఏ అయ్యరో_పంతులో వుండా ల్సిందే! తను అన్నం వార్చలేకపోతే మాత్రం వచ్చిన నష్టం ఏమిటి? పిచ్చివదిన అంతా తనలాగే వుంటారను కొంటుంది.

"తొందరగా వెళ్ళాలన్నావ్ భోజనానికి లేవవుటే!" అంటూ వచ్చింది పార్వతమ్మ.

* * *

ఆనాడు ముసిముసిగా నవ్వుకున్న కమల ఈనాడు దీర్ఘంగా నిట్టూర్చింది_గుంజిపడ్డపాదం భగభగా మండుతుంటే కాస్త కొబ్బరినూనె రాయటానికి ఉపక్రమించింది తన ఆశా సౌధాలన్నీ గాలిలో కలిసిపోగా తెలిసి వచ్చిన సత్యం మాత్రం మనస్సుని కూడా మండిస్తోంది_తను బొత్తిగా దురాశ పడిందేమోనని పశ్చాత్తాపం కల్గుతోంది కొద్దిగా.

కాకపోతే ఏమిటి? ఎంతయినా చదివిస్తానంటూ సరదా పడిన నాన్నగారు అకస్మాత్తుగా తనకు పెళ్ళిసంబంధం

కుదర్చట ఏమిటి ? — "పిల్లవాడు చాలా యోగ్యుడు క్రమంగా ప్రమోషన్లు వచ్చే అవకాశాలుకూడా వున్నాయి. అన్నిటినీ మించి పెద్దగా బాదరబందీ లేని కుటుంబం- తల్లీ, చెల్లెలూను. లక్షణంగా వుంది సంబంధం!" అంటూ చెప్పు కొచ్చారు. అదేం చిత్రమో - అమ్మ కూడా నాన్నగారి అభిప్రాయంతో ఏకీభవించి తనకు పెళ్ళి చేసెయ్యాలన్న నిశ్చయానికి వచ్చేసింది - "ఎన్నేళ్ళు వుంచితేమాత్రం ఆడపిల్లకి పెళ్ళిచెయ్యటం తప్పుతుందా? ఈ రోజులను బట్టి తొందరగా జరిపించటమే మంచిది!" అనేసింది.

తల్లిదండ్రుల నిర్ణయం విన్న కమల నిర్ఘాంతపోయింది. ఆ షాక్‌నుంచి తేరుకోకముందే పెళ్ళి చూపుల తతంగంలో మదన మోహన్‌ని చూడటం జరిగింది-అనుకున్నంత తీవ్రంగా పెళ్ళి వద్దని వ్యతిరేకించలేక పోవటానికి మదనమోహన్ అందమే కారణంకావచ్చు. మోహన్ చిరునవ్వూ, ఒత్తయిన జుట్టూ, నిశితమయిన చూపులూ, నడకలో ఠీవీ, మాటల్లో మాధుర్యం-మొత్తం మోహన్ సౌందర్యం కమలను మరేమీ వెనడకాకుండా చేసింది-ఎప్పటికో చదువు ముగించి పెళ్ళి చేసుకోబోతే మదన్‌మోహన్ వంటి అందగాడే ఎలా లభించాలి? తనవంటి సామాన్య యువతికి అంతటి అందగాడు భర్తగా లభిస్తే అదృష్టం కాదా? అతని చిరునవ్వుతో జీవితమంతా గడిపివేసుకో కూడదా? అతని సౌందర్యానుభవంతో సర్వం మర్చిపోకూడదా? అతన్ని భర్తగా పొందగలిగిన గర్వం ఒక్కటి చాలదా?

కమల సిగ్గు దొంతరలలో పెళ్ళికి సిద్ధ మయింది.

అనుకోనంత చిత్రంగా గృహిణి అయింది.

అందరి ఆడవాళ్ళలాగే కమలకూడా కొత్తకోడలై అత్త వారింటికి వచ్చింది_ కాని...

తలుపుమీద దబదబా చప్పుడౌతోంటే అంతకన్నా వేగంగా కొట్టుకుంటూన్న గుండెలతో నెమ్మదిగా వెళ్ళి తలుపు తీసింది.

"అబ్బ: ఏం వదినా? ఏం చేస్తున్నావ్?"

రాధని చూచి కాస్త తమాయించుకొంది కమల - "మీ అమ్మగారు..."

"ఇంటికి పొమ్మని ఇందాకే చెప్పివెళ్ళింది వదినా! నేనే ఆడుకుంటూ వుండిపోయాను. పాపం-నువ్వు ఒక్క దానివే వున్నావు కదూ వదినా? నీకు భయం వెయ్యలా?"

కమలకేమీ మాట్లాడ బుద్ధికాలేదు వంట చెయ్య లేదు. అత్తగారు వస్తే ... గుర్తు వచ్చి నప్పుడల్లా భయం తెరలు తెరలుగా ముంచెత్తుతోంది.

"మనం యిద్దరమే వుంటే బాగాలేదు వదినా! మా అమ్మని తొందరగా పిల్చుకొచ్చేస్తానూ!" అంటూ సంధించి విడిచిన బాణంలా పరిగెత్తింది రాధ వీధిలోకి.

ఏమీ తోచక బిక్క మొహం వేసుకుని వంటింటి గడపలో కూచ్చుంది కమల నిముషాలులెక్క బెడుతూ,

ఆ లెక్క ఎంతో సేపు సాగలేదు_ "అదేమ్మా? దీపా లైనా వెలిగించుకోకుండా కూచ్చున్నారూ? ఒసేవ్

రాధా! ... ఎక్కడున్నావే? అమ్మాయ్ కమలా! రాధ యింటికి రానేలేదూ?" అంటూ చీడీ లెక్కుతూనే మాట్లాడుతూ – "రా! శేషమ్మొదినా? లైటు వేస్తాను." అంటూ వెంటవచ్చిన స్నేహితురాల్ని సాదరంగా ఆహ్వానిస్తూ వీధి గదిలో అడుగుపెట్టింది సావిత్రమ్మ.

కమల మౌనంగా లేచి నిలబడింది.

సావిత్రమ్మ వీధి లైటు వేస్తూ, "అమ్మాయ్ కమలా! ఒక్కసారిలా రా! శేషమ్మ పిన్నిగారు నిన్ను చూస్తుందట..." అంటూ పిల్చింది కోడల్ని. కమల – చేసేది లేక చీర కుచ్చెళ్ళు పాదాల నిండుగా కప్పుకొంటూ నెమ్మదిగా నడిచి వచ్చింది.

"అదేమిటే కుంటుతున్నావ్? కాలుకేమైందీ? ముల్లేదైనా గుచ్చుకుందా ఏమిటి ఖర్మ?" కంగారుగా అడిగింది సావిత్రమ్మ.

"ఏం లేదు" అంది పొడిగా కమల.

"ఏం లేకపోవటం ఏమిటి అలా కుంటుతూ నడుస్తూను" రెట్టించింది అత్తగారు – ఇక చెప్పకపోతే బావుండదనుకున్న కమల కాస్త ధైర్యం తెచ్చుకు అనేసింది– "గంజి కాలిమీద ఒలికింది. నాకు సరిగ్గా అన్నం వార్చటం రాదత్తయ్యా."

సావిత్రమ్మకి మొదట వింటూన్నదేమిటో అర్థం కానే లేదు. అన్నం వార్చటం రాదంటూందేమిటి? అన్నం వండనే లేదా– ఏమిటి ఖర్మ? అయినా నెమ్మదిగానే అంది– "తప్పేదు, బియ్యం వార్చడానికే గంజి కాళ్ళమీద ఒంపుకున్నావా?

బాగానే వుంది. పోనీ కాలికి నూనె చుక్క రాశావా లేదా? పోనీ పచ్చడి చేశావా?"

కమల భయం భయంగా అంది నేలచూస్తూ - "లేద త్తయ్యా! ఎలా చెయ్యాలో... తెలీలేదు"

సావిత్రమ్మ అయోమయంగా నోరెళ్ళబెడుతోంటే, వెంటవచ్చిన స్నేహితురాలు శేషమ్మొదిన నవ్వుతూ అంది- "చదువుకున్న పిల్ల కాదుటమ్మా వదినా! వంటా వార్పూ అంతగా తెలీవేమో!"

తన కోడలు బొత్తిగా అంతచేతగానిదనీ దోసకాయ పచ్చడైనా చెయ్యలేనిదనీ ఎదటి యిల్లాలు అనుకోవటం సావి త్రమ్మకి తల తీసుకున్నంత పని అయింది. కోడలి మీద వస్తూన్న కోపమంతా అణుచుకొంటూ వంటింట్లోకి తొంగి చూసింది-అది చూసి తీరాల్సిన దృశ్యం! అన్నంగిన్నె గంజితో చితచితలాడుతూ మూతలేక నోరు తెరిచి చూస్తోంది. బొగ్గుల్లో పడి మాడీమాడని బియ్యం తెల్లనల్లగా మెరిసి పోతున్నాయి. తీసి యథాస్థానంలో సర్దబడని కత్తిపీటా చేటా గది మధ్య పరస్పరం పరామర్శించు కొంటున్నాయి. సగం చెక్కి వుంచిన దోసకాయని వదిలేసి తుర్రుమని పరుగు తీసిందో ఎలకపిల్ల.

గందరగోళంలా వున్న వంటిల్లు చూస్తోంటే సర్వం అర్థమైపోయింది. సావిత్రమ్మకు-అయితే యిప్పుడు పునఃప్రతిష్ఠ చేసి అన్నాలూ కూరలూ వండి చావాలన్నమాట.

అత్తగారి వెనకే అపరాధిలా నిలబడింది కమల మౌనంగా. ఆ జాలి చూపులనీ అర్థం చేసుకునే స్థితిలో లేదు సావిత్రమ్మ. కోపాన్నంతా దిగమింగుకొంటూ ఒక్కమాటే అడిగింది.—"అయితే అమ్మాయ్! నువ్వు ఆడపుట్టక పుట్టావూ?"

కమల ఒక్కసారి తలెత్తి చూసి తిరిగి దించేసుకొంది. మౌనాన్ని మాత్రం భూషణంలా ధరించింది.

"ఎంతో నిర్వాకం చేస్తావని పెత్తనాలకి తగలడ్డాను. పోనీ నీకు టింగురంగా మంటూ తిరుగుడేగానీ, పనీపాటూ వంటబట్ట లేదని చెప్పనైనా చెప్పావా? నాపేడుపేదో నేను ఏడ్చేదాన్నిగా?"

కమల ఙన్నురాలై నిలబడిపోయింది. మాట్లాడాలన్న ధ్యాస కూడా లేకుండాపోయింది.

"ఏం వదినా అక్కడే వుండిపోయావ్" అంటూ శేషమ్మగారు పిలుస్తోంటే సావిత్రమ్మ బాధ కడుపులో ఇముడ్చుకోలేక — "ఒక్కసారిలా వచ్చిచూడు, వదినా! నీ కళ్ళతో నువ్వుచూడు. ఇంటి కొచ్చేసరికి యిదీ భాగోతం. ఇంకా ఎప్పుడు అన్నం కూరా వండి చావను?" అంటూ వెళ్ళపోసుకొంది.

శేషమ్మగారు వంటింటి గడపలోకి వచ్చి నవ్వుతూ— "చదువుకున్న కోడళ్ళు అందరికీ వస్తారుటమ్మా? పనిపాటలు ఇవ్వాళ కాకపోతే రేపైనా వస్తాయి" అంది హాస్యంగా.

"ఆఁ వస్తాయి. నే పోయాక రాకేం చేస్తాయి? కోడలికి చదువుంటే నాకేం ఒరిగిందా? నీకేం ఎన్నయినా చెప్తావు.

కోడలు చిలకలా చేసి పెడుతోంటే కూర్చుని గువ్వలా తింటూను. చెప్పవూ మరి?"

శేషమ్మగారు మళ్ళా నవ్వింది—"సరేలే! నీ యిష్టం వచ్చినట్టే అనుకో. రేపు తీరిగ్గా వస్తాలే. పనిలో వున్నావు." అంటూ వెళ్ళిపోయింది. మనసు మంచిదైనా నోరు చెడ్డదైన సావిత్రమ్మ నోరు అంతలో పోనివ్వటానికి వూరుకోలేదు. కుంపట్లో గుప్పెడు పొడిబొగ్గులు వేసి అంటిస్తూ—"కాకి పుట్టి నలుపే! పెరిగీ నలుపే నట. కోడలొచ్చి ఒకటే రాకా ఒకటే అయింది." అనుకొంది గట్టిగా.

కమల మనస్సు చివుక్కుమంది. అవును. కోడలొస్తే అత్త సుఖపడాలని ఆశపడుతుందంటారు. వదిన అమ్మ నెన్ని విధాల సుఖపెట్టటంలేదూ? తప్పెడు బియ్యం వార్చలేక యిల్లు పెంటలా చేసిపెట్టిన తనలాంటి కోడల్ని అన్నారంటే అనరూ?

"అయ్యో! విడ్డూరం! చదువులున్న వాళ్ళనీ చూశాం, ఇదెక్కడి పిచ్చి కలి? ఎంత చదివితే మాత్రం ఆడది ఆడది కాకపోతుందా? మొగుడూ కాపరం లేకుండా పోతాయా? ఏంగారాలో! ఏం పెంపకాలో! ఆడపిల్లని ఆడపిల్లలా పెంచుకోవద్దూ? కట్టుకున్నవాడేమైనా కూడుతినాలా? మగాడితో సమానంగా తిరగాలంటే పెళ్ళిళ్ళు మానుకుని పుట్టిళ్లలోనే వుండిపోతే ఏ బాధా లేదుగా? అత్తగారు సాధించిందను కోటానికిగానీ ఏమిటి?"

సావిత్రమ్మ ఏమిటేమిటో అనుకొంటూనేవుంది. కుంపటి టపటపా విసురుతూ—నిప్పునెరుసుల్లా ఆవిడ కోపం నిముష నిముషానికీ ప్రజ్వరిల్లుతోంది.

కళ్ళల్లో నిలవని నీళ్ళు బుగ్గలమీదుగా జారుతోంటే గదిలోకి వెళ్ళిపోయింది కమల. ఎన్నడూ ఎవరిచేతా పన్నెత్తు మాట పడని కమలకు దుఃఖం తెరలు తెరలుగా ముంచుకు వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుంది.

అంత దుఃఖంలోనూ పుట్టెడుకోపం ముంచుకువచ్చింది తల్లి మీద-దీనికంతకూ కారణం అమ్మే! అమ్మే! తనకు పనిపాటలు నేర్పకుండా మంచి చెడ్డలు చెప్పకుండా పెంచింది. బాధ్యతలేవో తెలుసుకోనివ్వకుండా గారాం చేసింది. ఆదినుంచీ అమ్మే సక్రమంగా పెంచివుంటే ఈనాడిలా మాటలు పడి ఏడ్చుకోవల్సిన గతి పట్టేదు కాదు-కోడలిగాఅత్తగారిముందు గర్వంగా తలెత్తుకోగలిగేది తను. భార్యగా భర్తను అన్ని విధాలా సంతోషపెట్టగలిగేది. ఏదీ అంత అదృష్టం?

ప్రతితల్లీ బిడ్డల్ని ప్రేమిస్తుంది- సుఖపెట్టాలని కోరుతుంది కాని తన ప్రేమ మరొకరికి ద్వేషం కల్గించేలాగ, తనిచ్చిన సుఖం మరో నాటికి కష్టాలపాలు చేసేలాగ తయారయితే ఏముంది?

హద్దులుమీరి అర్థాలనే గోల్పోయే ప్రేమ ప్రేమకాదు.

బిడ్డల భవిష్యత్ గుర్తించలేని పెంపకం పెంపకంకాదు.

తృళ్ళిపడింది కమల-క్షణంలో గ్రహించుకుని భర్త చేతుల్లో మొహం దాచుకుంది.

"కమలా!" ఆతృతగా, ఆశ్చర్యంగాపిలిచాడు మదన్ మోహన్.

"ఛ! ఏడుస్తున్నావా? ఎందుకు? ఏమి అయిందీ?"

జవాబు చెప్పలేని కమల మోహన్ ఒడిలో ఒదిగి పోయింది.

"చీకట్లో యేడుస్తూ కూర్చున్నావా? ఏమయిందీ? నాకు చెప్పవూ? మీ అమ్మగారు గుర్తు వచ్చారా?"

లేదన్నట్టు అడ్డంగా తల వూపింది కమల.

"మరి మీ నాన్నగారా?" నవ్వుతూ అడిగాడు మోహన్ కమల చెక్కిళ్ళు తుడుస్తూ.

కమల నోరు పెగుల్చుకుని అంది నెమ్మదిగా – "నేను మా వూరు వెళ్ళనా?"

"మీవూరా? ఎందుకూ?" ఆశ్చర్యపడ్డాడు మోహన్.

కమల పసిపిల్లలాగ భర్త మొహంలోకి చూస్తూ అంది– "బొత్తిగా నాకు పనులేవీ రావటం లేదు. మా వదిన దగ్గర నేర్చుకుంటాను."

మోహన్ నవ్వాడు – "భలేదానివి, పని నేర్చుకోటానికి వూరు విడిచి వెళ్ళిపోవాలా? మా అమ్మ లేదూ?"

"అలాకాదు, మా వదిన దగ్గిరే నేర్చుకుంటాను. ఒక్క వారం రోజుల్లో వచ్చేస్తానుగా?" ప్రాధేయపడింది.

"కమలా!"

"ఏమిటి? చెప్పండి!"

"నువ్వు వచ్చి వారం రోజులు కాలేదు. ఇప్పుడు వెళ్ళిపోతానంటే..."

"నాకూ మిమ్మల్ని విడిచివెళ్ళటం కష్టమే. అయినా ఈ ఒక్కసారికీ పంపించండి! మీకు నా చేతులతో అన్నం

వండి వడ్డించలేని నేను ఎంత సిగ్గు పడుతున్నానో తెలీదు. నేను అన్నీ చేయగలననే ధైర్యం వచ్చేవరకూ అత్తయ్య ఎదుట తల ఎత్తుకు తిరగలేను. నిజంగా ఈ ఒక్కసారికి నన్ను పంపించండి!"

"పిచ్చి కమలా! అలాగే వెళుదువులే - ఊరుకో, సరేనా?" అంటూ కమలను దగ్గిరికి తీసుకుని బుజ్జగించాడు మోహన్.

* * *

రాజేశ్వరి బుగ్గమీద వేలు వేసుకొంది - "ఎంత చిత్రంగా మారిపోయావు కమలా! ఈ వారం రోజులకే చిక్కిపోయావు కూడా. నేను నమ్మలేకుండా వున్నాను.-ఇవ్వాళేగా వచ్చావు. నాలుగు రోజులు పోనీ! పనులన్నీ అలాగే నేర్చుకొందువుగాని! మీ అన్నయ్య అలమారులో కొత్త పుస్తకాలు వున్నాయి. చూసుకొంటూ వుండు - నేను పప్పు రుబ్బాలి, నీకు పకోడీలంటే ఇష్టంకదూ? పప్పునానబోశాను."

"పప్పు నేను రుబ్బుతాను వదినా!" అంటూ లేచింది కమల.

"అయ్యో! పిచ్చి పిల్లా! ఇంత తాపత్రయ మేమిటమ్మా? ఆడదానివి గదా - పనులే నేర్చుకోలేనని భయపడ్డావా? మీ అత్తగారు నిన్ను హడలగొట్టేసిందా ఏమిటి?" అంటూ నవ్వింది రాజేశ్వరి.

పార్వతమ్మ నిద్రలేచి వస్తూ, "ఏమే రాజేశ్వరీ! ఇంటికొచ్చిన ఆడబిడ్డ పారిపోతుందా ఏమిటే? లేచి పప్పు రుబ్బ

కూడదూ? కబుర్లంటే చాలు తల్లీ! కడుపు నిండిపోతుంది నీకు!" అంటూ పురాణం విప్పబోయింది.

కమల అయిష్టంగా నుదురు చిట్లిస్తూ, "మాటికీ చీటికీ వదిన్నేమీ అనకమ్మా! కోడలనేసరికి సాధించాలని బుద్ధి పుడుతుందా ఏమిటి అత్తలకి? ఒక తల్లి కన్నబిడ్డని నువ్వు తప్పు పడితే నువ్వు కన్నబిడ్డని మరొకళ్ళు తప్పుబడతారు. అంతేగా?" అంది నిర్మొహమాటంగా.

పార్వతమ్మ బుగ్గలు నొక్కుకొంది. ఆశ్చర్యంగా చూస్తూ, "ఏమిటే తల్లీ! వుపన్యాసమిస్తున్నావు?" అంది అయోమయంగా.

రాజేశ్వరి లేస్తూ, "రా! కమలా! వంటింట్లోకి వెళ్దాం. నువ్వు ఉల్లిపాయలు ఒలవాలి. నేను పప్పు రుబ్బుతాను." అంది నవ్వుతూ.

కమల ఇబ్బందిగా మొహం పెట్టింది– "తప్పదంటావా వదినా"

"తప్పదమ్మా! తప్పదు. అక్కడ మీ ఆయన నీకోసం ఎదురు తెన్నులు చూస్తూ వుంటారు. నువ్వీ పూట పకోడీలలోకి ఉల్లిపాయలు ఒలిచే తీరాలి."

ఫక్కుమని నవ్వుకుంటూ వంటింటికేసి నడిచారిద్దరూ.

[ఆగస్టు '63' నెలవంక నుంచి]